క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్‌ఎస్‌పీడీసీఎల్–11కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ ప్రకటించారు. ఫీవర్ ఆసుపత్రి ఫీడర్ పరిధిలో లింగంపల్లి, సత్యమ్మ కళాశాల, గణేష్ ఆలయం, రాఘవేంద్రస్వామి ఆలయం, అంజయ్య క్వార్టర్స్, అరుణ ఫోటో స్టూడియో తదితర ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు, కృష్ణానగర్ ఫీడర్ పరిధిలో దుర్గానగర్, కమలానగర్, డీటీఆర్ తదితర ప్రాంతాల్లో 10 గంటల నుంచి 12 గంటల వరకు, బసంత్ కాలనీఫీడర్ పరిధిలో విఠల్‌వాడీ, భగీరథ అపార్టుమెంట్, లింగంపల్లి, విఠల్‌వాడీ తదితర ప్రాంతాల్లో 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

నియామకం

చిక్కడపల్లి: మెట్రాలజీ లైసెన్స్ హోల్డర్స్ అసోసియేషన్స్ జాతీయ ఉపాధ్యక్షుడిగా (రాష్ట్ర అధ్యక్షుడు) ఎండీ .రబ్బాని ఎన్నికయ్యారు. సోమవారం గాంధీనగర్‌లో కార్యదర్శి ప్రసాద్, కోశాధికారి నరేష్, ఉపాధ్యక్షుడు గిరిధర్‌రావు మాట్లాడుతూ.. రాయపూర్‌లో జరిగిన ఆల్ ఇండియా లీగల్ మెట్రాలజీ లైసెన్స్ హోల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశం విజయవంతంగా ముగిసిందన్నారు. 19 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారని ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారన్నారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడి నియామకం



కేసరి నర్సింగ్‌రావును సత్కరిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కాచిగూడ: బీజేపీ సీనియర్ నేత కేసరి నర్సింగ్ రావుయాదవ్ ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా సోమవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డిని బర్కత్‌పురలోని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలపగా.. కేంద్ర మంత్రి ఆయనను సత్కరించి అభినందించారు. పార్టీకోసం పనిచేసే కార్యకర్తలకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. బీజేపీ గోల్నాక డివిజన్ కన్వీనర్ మూల రవీందర్‌గౌడ్, ఎం.కృష్ణంరాజు, దామోదర్, రంగారావు తదితరులున్నారు.

వేముల రామకృష్ణకు బంగారు నంది అవార్డు



అవార్డును అందుకుంటున్న విద్యార్థి ఉద్యమనేత వేముల రామకృష్ణ

కాచిగూడ: మంజునాథ ఫౌండేషన్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా రవీంద్రభారతిలో విద్యార్థి ఉద్యమ నేత వేముల రామకృష్ణకు సోమవారం బంగారు నంది అవార్డును ప్రదానం చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో గత 20 ఏళ్లుగా విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొని విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఆయన ఎంతగానో కృషి చేశారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లో అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని కోరుతూ.. డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ సికింద్రాబాద్ డివిజన్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను వినతిపత్రం అందజేశారు. సోమవారం జోనల్ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్‌ను కలసిన కార్పొరేటర్ ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కమిషనర్ సానుకూలంగా స్పందించారన్నారు. త్వరలో పనులు పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారన్నారు.



జోనల్ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

అధిష్టానం ఆదేశాల మేరకే నిర్ణయం

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్



అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న అంజన్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్: అధిష్టానం ఆదేశాల మేరకే ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి పోటీచేసేందుకు దరఖాస్తు చేసుకున్నానని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సికింద్రాబాద్ మాజీ ఎంపీ ఎం.అంజన్ కుమార్‌యాదవ్ అన్నారు. సోమవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో అంజుమన్, తాజీరానేచిరం, మర్కజీ పంజ్ కమిటీ, ప్లాస్టిక్ స్క్రాబ్ అసోసియేషన్ నూతన కమిటీలకు ఎన్నికైన సభ్యులకు భోలక్‌పూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అంజన్‌కుమార్‌యాదవ్ సభ్యులందరికీ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. తాను ఎంపీగా ఉన్నప్పుడు రాజకీయాలకు అతీతంగా ముషీరాబాద్‌లో ఎన్నో అభివృద్ధి పనులను చేపట్టామన్నారు.

ప్రజల అండదండలతో మరోసారి..

అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా పనిచేశామని, వారి అండదండలతో మరోసారి ముషీరాబాద్‌లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని అభిప్రాయపడ్డారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండరని రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు.

రాష్ట్రం ఇచ్చిన పార్టీని మోసం..

తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని సీఎం కేసీఆర్ మోసం చేశారని దివంగత హోంమంత్రి నాయిని నర్సింహ్మారెడ్డిని సీఎం కేసీఆర్ మోసం చేయడం వల్లే ఆయన మనోవేదనకు గురై మృతి చెందారని ఆరోపించారు. తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. దేశంలో సెక్యూలర్ పార్టీ కాంగ్రెస్ పార్టీనేనన్నారు. మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, భోలక్‌పూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు జఫీరుద్దీన్, అంజుమన్ సొసైటీ అధ్యక్షుడు అక్తర్ అలీ, మర్కజీ పంజ్ కమిటీ అధ్యక్షులు మహ్మద్ అలీ సోఫీ సర్మద్, ప్లాస్టిక్ స్క్రాబ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నజీముద్దీన్, నూర్‌ఉల్ హసన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నియాజ్, రహీం, సురేష్‌కుమార్, వెంకట్ తదితరులున్నారు.

గందరగోళం వద్దు..

ముషీరాబాద్ నుంచి మా కుటుంబం నుంచి పోటీ చేసేందుకు తానే దరఖాస్తు చేసుకున్నానని నా కుమారుడు, కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ దరఖాస్తు చేసుకోలేదని స్పష్టం చేశారు. ఇందులో కాంగ్రెస్ నాయకులు, ప్రజలు గందరగోళపడొద్దని అంజన్‌కుమార్‌యాదవ్ స్పష్టం చేశారు. తమ కుటుంబసభ్యుల్లో పోటీ చేసే విషయంలో కార్యకర్తల్లో అనుమానాలు వద్దన్నారు. అధిష్టానం ఆదేశాల మేరకే నిర్ణయం తీసుకుంటానన్నారు.

పేదల సొంతింటి కల సాకారం చేసేందుకే 'గృహలక్ష్మి'



భోలక్‌పూర్‌లో దరఖాస్తు ఫారాలను తీసుకుంటున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: పేదల సొంతింటి కల సాకారం చేసేందుకే సీఎం కేసీఆర్ గృహలక్ష్మి పథకాన్ని అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. సోమవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని అంజుమన్ సొసైటీ తాజీరానేచిరం కార్యాలయంలో గృహలక్ష్మి పథకం దరఖాస్తులను ఎమ్మెల్యే ముఠా గోపాల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు ఇళ్లు కట్టుకునేందుకు ప్రభుత్వం రూ.3 లక్షలు అందజేస్తుందన్నారు. 100 గజాలలోపు స్థలం ఉన్న వారంతా ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, అంజుమన్ తాజీరానేచిరం సొసైటీ అధ్యక్షుడు మహ్మద్ అక్తర్‌అలీ, ఉపాధ్యక్షుడు అమీనుద్దీన్, ప్రధాన కార్యదర్శి వాహేద్ హుస్సేన్, మర్కజీ పంచ్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ అలీసోఫీ, జహంగీర్, షరీఫీఉద్దీన్, మున్వర్‌చాంద్, మహ్మద్ అలీ తదితరులున్నారు.

హరినాథ్‌గౌడ్‌వి నిస్వార్థపు సేవలు

కొనియాడిన హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ



కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న బండారు దత్తాత్రేయ

ముషీరాబాద్: నిస్వార్థంగా, సేవా భావంతో బత్తిని హరినాథ్‌గౌడ్, వారి కుటుంబ సభ్యులు ఉబ్బస వ్యాధిగ్రస్తులకు ఉచితంగా చేప మందు పంపిణీ చేశారని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కొనియాడారు. ఇటీవల మృతిచెందిన హరినాథ్‌గౌడ్ కుటుంబాన్ని సోమవారం భోలక్‌పూర్ పద్మశాలి కాలనీలోని వారి ఇంటికి వెళ్లి గవర్నర్ పరామర్శించారు. హరినాథ్‌గౌడ్ కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. బత్తిని కుటుంబానికి ప్రభుత్వం సహకరించాలని కోరారు. చేప మందు తయారీకి కావాల్సిన ఔషధ మొక్కల పెంపకానికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరించాలన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.విశ్వం, దళిత మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నందగిరి నర్సింహ్మా, బైరు ఉపేందర్, నిత్యానంద్, భోలక్‌పూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రవికుమార్ తదితరులున్నారు.

మున్నూరుకాపు మహిళలకు ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలి

కాచిగూడ: బీఆర్‌ఎస్ పార్టీలో మున్నూరుకాపులకు 10 ఎమ్మెల్యే సీట్లు కేటాయించినా.. ఒక్క మహిళకు కూడా సీటు కేటాయించకపోవడం విచారకరమని మున్నూరుకాపు సంఘం గ్రేటర్ హైదరాబాద్ మహిళా అధ్యక్షురాలు బండారి లత అన్నారు. సోమవారం కాచిగూడలోని సంఘ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. ఆదివారం జరిగిన మున్నూరుకాపు ప్లీనరి సన్నాహక సమావేశంలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మున్నూరుకాపు మహిళలను గుర్తించి అన్ని రాజకీయపార్టీలు ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని కోరారు. మహిళలను విస్మరించిన పార్టీలకు ఓటుతో గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న మేదర సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బాలరాజు

నల్లకుంట: అన్ని రంగాల్లో వెనుకబడిన మేదరులను రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నాయని మేదరి సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బాలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. మేదరుల సమస్యలపై అసెంబ్లీలో తమ వాణి వినిపించేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించాలన్నారు. సోమవారం నల్లకుంటలోని బీసీ జాగృతి భవన్ ఆవరణలో ఆయన మాట్లాడారు. మల్కాజిగిరి, అంబర్‌పేట నియోజకవర్గాల్లో మేదరుల జనాభా ఎక్కువగా ఉంటుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని అన్ని రాజకీయ పార్టీలు మేదరులకు ఎమ్మెల్యే టికెట్లు కేటాయించాలన్నారు. మేదర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోన రాజశేఖర్, వెంకట్ రాముడు, ఉపాధ్యక్షుడు పుట్టయాదగిరి, సుమన్, రాజేందర్, తుమ్మల శ్రీనివాస్, నాగరాజు తదితరులున్నారు.

సివరేజ్ పైపులైన్ పనులను చేపట్టాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్

కాచిగూడ: సివరేజ్ పైపులు లేక గత కొంతకాలంగా కాచిగూడ డివిజన్‌లోని లాల్ బహదూర్‌స్కూల్, చెప్పల్‌బజార్, లింగంపల్లి, బాలప్పబాడ తదితర ప్రాంతాల్లో సివరేజ్ పైపులైన్ నిర్మాణపనులు జరగడం లేదని కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ అన్నారు. సివరేజ్ పైపులైన్ పనులు జరగకపోవడంతో స్థానికులు, వాహనదారులు రోజూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సివరేజ్ పైపులు తెప్పించి పైపులైన్ పనులు వెంటనే జరిగేలా చూడాలని కోరుతూ.. సోమవారం కార్పొరేటర్ జలమండలి జీఎం రామకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. పనులు జరగకపోవడంతోనే సీసీరోడ్డు పనులను చేపట్టలేకపోతున్నామన్నారు. బీజేపీ నేతలు ఆర్.సంతోష్, ఓంప్రకాష్, భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, ఆనంద్ తదితరులున్నారు.

ఘనంగా పూర్ణకుంభాభిషేకం



ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్ విద్యానగర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూర్ణకుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. సోమవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ముఠా జైసింహ, వకులాభరణం కృష్ణమోహన్ తదితరులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వీరబ్రహ్మేంద్ర స్వామి మందిర ట్రస్టీలతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు సురేందర్, జల్లా భిక్షపతి, రాజమోహన్ రెడ్డి, శంకర్‌ముదిరాజ్, రవియాదవ్, ముచ్చకుర్తి ప్రభాకర్, అనురాధా, ప్రేమలతారెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవ సమితి డివిజన్ కన్వీనర్ల నియామకం



అంబర్‌పేట: నియోజకవర్గంలో గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ జి.ఆనంద్‌గౌడ్ తెలిపారు. సోమవారం అంబర్‌పేటలో జరిగిన సమావేశంలో ఉత్సవ సమితి డివిజన్ల కన్వీనర్లను నియమించారు. గోల్నాక డివిజన్‌కు కె.నర్సింగ్‌రావుయాదవ్, బాగ్‌అంబర్‌పేట చుక్క జగన్, అంబర్‌పేట డివిజన్ జిల్లా రవీందర్ గుప్తా, నల్లకుంట డివిజన్ కె.లక్ష్మణ్ యాదవ్, కాచిగూడ డివిజన్ సుభాష్ పటేల్‌ను నియమించారు. బీజేపీ నాయకులు నాగభూషణం చారి, రాజేష్ మెహతా, ఈశ్వర్, నారాయణ తదితరులున్నారు.

ఆంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపు

చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయ హుండీ ఆదాయం లెక్కించగా రూ.3,28,860లుగా తేలింది. సోమవారం హుండీ లెక్కింపు ఆలయ కార్యనిర్వాహణ అధికారి ఎం.దేవనాథం, దేవాదాయ, ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ, ఈఓ జ్యోతిల పర్యవేక్షణలో లెక్కింపు జరిగింది. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ.. శ్రావణమాసం, వరలక్ష్మి వ్రతాలు, పూజా కార్యక్రమాలు కావడంతో ఆదాయం పెరిగిందన్నారు. భక్తులకు మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక భావనను పెంపొందించడమే తమ ధ్యేయమన్నారు. ఆలయ ధర్మకర్తలు మురికిగణేష్, భాషని పద్మా సూర్యప్రకాష్, లయన్ జి.కె.రమణ, పూజారులు బుగ్గలక్ష్మీపతిశర్మ, వెంకటాద్రి, సిబ్బంది అచారి, భక్తులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ సర్వీస్ జీఓ గెజిట్ చేయాలి

చిక్కడపల్లి: కార్మికశాఖ 2021లో విడుదల చేసిన సెక్యూరిటీ సర్వీసెస్ కనీస వేతనాల జీవో 21ను గెజిట్ చేయాలని డిమాండ్ చేస్తూ.. ప్రైవేటు సెక్యూరిటీ గార్డ్స్, అలైడ్ వర్కర్స్ యూనియన్స్ ఆధ్వర్యంలో తెలంగాణ కార్మిక కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ మాట్లాడుతూ.. ప్రైవేటు సెక్యూరిటీ గార్డ్స్ అనుబంధ కార్మికుల వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. 2021లో అప్పటి లేబర్ వెల్ఫేర్ బోర్డు యాజమాన్య సంఘాలు సంయుక్తంగా జరిగిన బోర్డు సమావేశంలో సెక్యూరిటీ సర్వీసెస్ గార్డ్స్‌కు వేతనం, వీడీఏ ఉండాలని నిర్ణయించామన్నారు. జీవో 21 జారీ సీఎం సంతకం కోసం పంపామని యాజమాన్యాల ఒత్తిడితో ఆయన ఆ జీవోను గెజిట్ చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. సీఐటీయూ నాయకులు ఈశ్వర్‌రావు, వెంకటేష్, సోమన్న, దామోదర్, శోభ, ఉమాశంకర్, నాగమణి పాల్గొన్నారు.

న్యూసెన్స్ కేసులో విద్యార్థులకు జైలు

- మాదక ద్రవ్యాలు సేవిస్తూ హల్‌చల్
- ఐదుగురు విద్యార్థులు, ఇద్దరు విద్యార్థినులకు జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు

ముషీరాబాద్: మాదక ద్రవ్యాలు సేవిస్తూ రోడ్లపై న్యూసెన్స్ చేయడమేగాక పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఐదుగురు విద్యార్థులు, ఇద్దరు విద్యార్థినులను ముషీరాబాద్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌యాదవ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విద్యానగర్, రాంనగర్, తిలక్‌నగర్, డీడీ కాలనీ పరిసర ప్రాంతాల్లో ఉంటున్న 8 మంది విద్యార్థులు దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ కాలనీలోని ప్రభుత్వ హోటల్ మెనేజ్‌మెంట్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. ఆదివారం వారు ఇద్దరు విద్యార్థినులతో సహా రాంనగర్‌లో ఉంటున్న రాహుల్ గదికి వచ్చారు. అనంతరం అందరూ కలిసి మాదక ద్రవ్యాలు సేవించారు. అనంతరం రోడ్డుపైకి వచ్చి న్యూసెన్స్ చేస్తుండడంతో స్థానికులు ముషీరాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై స్వప్న సిబ్బందితో అక్కడికి రాగా వారిపై దురుసుగా ప్రవర్తించడమేగాక విధులకు ఆటంకం కలిగించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పీటీ కేసు నమోదు చేసి సోమవారం 5వ ఎంఎం స్పెషల్ మార్నింగ్ కోర్టు జడ్జి లక్ష్మణ్‌రావు ఎదుట హాజరుపరిచారు. మాదక ద్రవ్యాలకు బానిసైన రాహుల్‌ను సికింద్రాబాద్‌లోని రిహ్యాబిలిటేషన్ సెంటర్‌కు తరలించి మిగతా ఐదుగురు విద్యార్థులకు రెండు రోజుల జైలు శిక్ష, ఇద్దరు విద్యార్థినుకు ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

'బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాలకు చేయూత'



ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న మైనార్టీ నేతలు

అంబర్‌పేట: అన్నివర్గాల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం తోడ్పాటును అందిస్తుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సోమవారం అంబర్‌పేట డివిజన్‌కు చెందిన పలువురు మైనార్టీ నేతలు కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గంలో మైనార్టీలకు ప్రత్యేక శ్మశానవాటికను ఎన్నికల హామీ మేరకు ఏర్పాటు చేశామన్నారు. మైనార్టీలకు కేసీఆర్ ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. షౌకత్ అలీ, రెహ్మాన్, నసీరుద్దీన్, హబీబ్, రషీద్, అయూబ్ తదితరులున్నారు.

'ఆఖరి యోధులు' పుస్తకావిష్కరణ



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పాలగుమ్మి సాయినాథ్ రచించిన 'ఆఖరి యోధులు' పుస్తకాన్ని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌజ్ ఆధ్వర్యంలో సీపీఎం పోలిట్‌బ్యూరో సభ్యులు బీ.వీ.రాఘవులు ఆవిష్కరించారు. అనంతరం రాఘవులు మాట్లాడుతూ.. విస్మృత యోధుల గాథలే ఈ ఆఖరి యోధులన్నారు. కేంద్ర ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధులను కూడా విభజిస్తుందని విమర్శించారు. ఈ పుస్తకంలో ఎందరో చిన్న చిన్న వ్యక్తులు కలిస్తేనే ఇంత పెద్ద స్వాతంత్ర్య పోరాటం జరిగిందన్నారు. వారి చరిత్రే ఈ పుస్తకంలో ఉందని, యువత చదవాల్సిన ముఖ్యమైన పుస్తకం అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం కుటుంబసభ్యులైన మల్లులక్ష్మికి తొలిప్రతిని అందజేశారు. పబ్లిషింగ్ హౌజ్ జనరల్ మేనేజర్ ఆర్.వాసు, మేనేజర్ కృష్ణారెడ్డి, సాహితీవేత్త నరహరి, రఘుపాల్, కొంపల్లి పవన్, మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ



ముషీరాబాద్: నిరుపేద విద్యార్థులను ఆదుకునేందుకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావాలని భారత్ సేవా శ్రమ్ సంఘ్ నగర అధ్యక్ష కార్యదర్శులు స్వామి మునీశ్వరానంద, వెంకటేశ్వరానంద పిలుపునిచ్చారు. ప్రతి ఏటా అనేక పాఠశాలల్లో పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్‌లను ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. సోమవారం భారత్‌సేవా శ్రమ్ సంఘ్ ఎస్‌టీపీసీల సంయుక్తాధ్వర్యంలో పుస్తకాలను అందజేశారు. ఎస్‌టీపీసీ రీజనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దేబాశిష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

వట్టి జానయ్యపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి



మాట్లాడుతున్న మేకల రాములు

కాచిగూడ: నల్గొండ జిల్లా డీసీఎం చైర్మన్ వట్టి జానయ్యపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజల మద్దతుతో రాజకీయంగా ఎదుగుతున్న ఆయనను రాజకీయంగా అణగదొక్కేందుకు 73 కేసులను పెట్టించి వేధిస్తున్నారని ఆరోపించారు. సొంత బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వ్యక్తిని ఎమ్మెల్యేగా పోటీ చేయకుండా పీడీయాక్ట్ ద్వారా జైల్లో పెట్టించాలని చూస్తున్నారన్నారు. ఈ విషయంపై సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ కలగజేసుకుని జానయ్యపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, గ్రేటర్ యూత్ అధ్యక్షుడు శ్రీశైలంయాదవ్, మహేష్‌యాదవ్, అనిల్, సునిల్‌కుమార్, తదితరులున్నారు.

యాదవులపై వేధింపులు మానుకోవాలి

కాచిగూడ: రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో యాదవులను రాజకీయంగా అణచివేయాలనే ఉద్దేశంతో యాదవులపై వేదింపులకు పాల్పడుతున్నారని యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్ ఆరోపించారు. సోమవారం బర్కత్‌పురలో ఆయన మాట్లాడుతూ.. సూర్యాపేట జిల్లాకు చెందిన వట్టే జానయ్యపై అక్రమ కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. జిల్లాలో వివిధ రాజకీయ పార్టీల్లో చురుగ్గా ఉన్న యాదవ నాయకులను రాజకీయంగా అణచివేసేందుకే అక్రమ కేసుల్లో ఇరికిస్తున్నారని ఆరోపించారు. మరోవైపు బీఆర్‌ఎస్ టికెట్లను కేటాయించిన నాగార్జున సాగర్, కోదాడ నియోజకవర్గాల్లో యాదవ అభ్యర్థులకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టడం తగదని అన్నారు. యాదవులను వేధించే చర్యలను సహించబోమని ఆయన హెచ్చరించారు. ఉపాధ్యక్షుడు నాగ సీతారాములు, ప్రధానకార్యదర్శి అచ్యుతయాదవ్, అధికార ప్రతినిధి నోముల శేషు, అల్లివేణు పాల్గొన్నారు.

రేపు ధర్మారావుకు గిడుగు పురస్కారం

కాచిగూడ: ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి సాధికార సంస్థ ఆధ్వర్యంలో తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకటరామూర్తి జయంతి సందర్భంగా ఈ నెల 29న విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న తెలుగుభాషా వికాస వారోత్సవాల్లో బర్కత్‌పురకు చెందిన సంస్కృతిరత్న కె.ధర్మారావుకు గిడుగు పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు ఆహ్వానపత్రికను అందజేశారని ధర్మారావు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ విద్యను ధ్వంసం చేస్తున్నారు

రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను పూర్తిగా ధ్వంసం చేస్తున్నారని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి విమర్శించారు. పేద, మధ్య తరగతి పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యా సంస్థల్లోకి విద్యార్థి సంఘాలు, మీడియా సంస్థలు రానివ్వకూడదనే మౌలిక ఆదేశాలను నిరసిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆకునూరి మురళి మాట్లాడుతూ.. అందరు సమానంగా ఉండకూడదనే భావించే వ్యక్తి ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఎద్దేవా చేశారు. అనేక పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కూడా కల్పించకపోవడం అత్యంత హేయమైన చర్య అన్నారు. రిటైర్డ్ ప్రొఫెసర్ జి.హరగోపాల్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ల్యాండ్ మాఫియా, లిక్కర్ మాఫియా, డ్రగ్స్ మాఫియాతో పాటు విద్యా మాఫియా కూడా పెరిగిపోయిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం తన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రైవేటు విశ్వవిద్యాలయాలను కట్టబెట్టి విద్యా మాఫియాకు పాల్పడ్డారని ఆరోపించారు. విద్యార్థులకు స్వేచ్ఛనిస్తే ప్రభుత్వ మనుగడకే ప్రమాదం అని కేసీఆర్ భావించి విద్యార్థి సంఘాలు, మీడియా సంస్థలను విద్యా సంస్థల్లోకి రానివ్వకూడదనే మౌలిక ఆదేశాలకు కుట్ర పన్నారని అన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ, ప్రొ. కోదండరామ్, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, నాగిరెడ్డి, ప్రొఫెసర్ నాగేశ్వర్, కె.ఎస్.ప్రదీప్, స్వాతి, నర్సింహారావు, వివిధ సంఘాల నేతలు కె.రమా, ఎం.అన్వేష్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.